ఆర్టీసీ బస్సుల్లో డీజిల్ చోరీ

నిలిచిన రెండు నైట్‌హాల్ట్ బస్సులు

వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో ఘటన

మహబూబ్‌నగర్ వైపు తీసుకెళ్లినట్లు జాడలు

7

మంచు కమ్మేసింది

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శనివారం తెల్లవారుజామున మంచు కమ్ముకున్నది. దుప్పటిలా పరుచుకొని ఊటీని తలపించింది. చుట్టూ ఉన్న పరిసరాలను కప్పేసింది. కళ్లు కుళ్ల బొడుచుకున్నా పదడుగుల దూరంలో ఏముందో కనిపించని పరిస్థితి నెలకొన్నది. దారి కనిపించక వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించగా.. తెల్లవారుజామున వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు స్వెటర్లు ధరించి, మఫ్లర్లు కట్టుకొని వెళ్లారు. మంచు ధాటికి సూర్యుడు కూడా తొంగి చూడకపోవడంతో వెలుతురు వచ్చేసరికి తొమ్మిది గంటలైంది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్ పట్టణంలోని ఏనుగొండ వద్ద ప్రధాన రహదారిపై కమ్ముకున్న పొగమంచు



మంచులో సగమే కనిపిస్తున్న రైలు



రోడ్డు కనిపించక లైట్లు వేసుకొని వస్తున్న వాహనాలు



స్వెటర్ ధరించి వెళ్తున్న వాహనదారుడు



మఫ్లర్, స్వెటర్ ధరించిన మహిళలు



పొగమంచుతో కమ్ముకున్న మహబూబ్‌నగర్‌లోని ఏనుగొండ

70 శాతం..

సివిల్ కేసులే

- పోలీస్ ప్రజావాణికి వస్తున్న ఫిర్యాదుల్లో అవే అధికం
- సోమవారం అధికంగా దరఖాస్తులు
- మూడేళ్లలో నారాయణపేట ఎస్పీ కార్యాలయ పరిధిలో 1,455 పిటీషన్ల నమోదు



నారాయణపేట ఎస్పీ కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా బాధితుడి ఫిర్యాదును వింటున్న ఎస్పీ యోగేష్ గౌతమ్(ఫైల్)

నారాయణపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో పోలీస్ ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్న దరఖాస్తుల్లో 70 శాతం ఆస్తి, భూ తగాదాలవే ఉంటున్నాయి. ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమంతో పాటు నిత్యం కార్యాలయ పని వేళల్లో ఫిర్యాదులు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. అధికంగా వచ్చే భూ తగాదాలు, సివిల్ కేసులకు సంబంధించి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో పాటు జిల్లాలోని 13 మండలాల తహసీల్దార్‌లను సంప్రదించాలని సూచిస్తున్నారు. భూ సమస్యలు కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని చెబుతున్నారు. సివిల్ కేసుల్లో పోలీస్ శాఖ తలదూర్చడం సరికాదని చెబుతున్నారు. భూవివాదాలతో పరస్పర దాడులకు దిగితే పోలీస్ శాఖ ఇరువర్గాలను శాంతింపజేసి భౌతిక దాడులకు పాల్పడకుండా చూస్తున్నారు. న్యాయ స్థానాలను ఆశ్రయించి, వారి ఆదేశాల ప్రకారం నడుచుకోవాలని సూచిస్తున్నారు. మిగతా 30 శాతం దరఖాస్తుల్లో పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినా ఎస్‌ఐలు కేసులు నమోదు చేయడం లేదని కొందరు, కేసు నమోదు చేసినా అరెస్ట్ చేయడం లేదని ఇంకొందరు, దాడులు చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని, దొంగతనాల కేసులో పురోగతి లేదని ఫిర్యాదులు ఉంటున్నాయి. కుటుంబంలో గొడవలు తరచుగా జరుగుతున్నాయని, వరకట్న వేధింపులు కొనసాగుతున్నాయని వస్తున్న కేసులపై ఎస్పీ వెంటనే స్పందిస్తున్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌ఐలతో పాటు అవసరమైతే సీఐలతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆదివారమూ ఆశ్రయించవచ్చు



నిత్యం కార్యాలయ పని వేళల్లో ప్రజలు నేరుగా ఎస్పీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు ఇస్తున్నారు. ప్రతీ సోమవారం ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయి. ప్రతీ దరఖాస్తును పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సివిల్ కేసులు ఉన్న వారిని కోర్టును ఆశ్రయించాలని చెబుతున్నాం. ఆదివారం అత్యవసరం అయితే నేరుగా ఎస్పీ బంగ్లాకు వచ్చి ఫిర్యాదులు ఇవ్వొచ్చు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీస్ శాఖ పని చేస్తోంది. సమస్యలుంటే 100కు డయల్ చేసి చెప్పాలి.

- యోగేష్ గౌతమ్, ఎస్పీ, నారాయణపేట

ఈ ఏడాది 516 దరఖాస్తులు

నారాయణపేట ఎస్పీ కార్యాలయానికి మూడేళ్లలో 1,455 దరఖాస్తులు వచ్చాయి. 2022లో 516 దరఖాస్తులు రాగా, 2023లో 423, 2024లో 516 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 70 శాతం భూ తగాదాలవి కాగా, 30 శాతం ఇతర ఫిర్యాదులు ఉన్నాయి.

వరకట్న వేధింపుల కేసులు

జిల్లాలో రెండేళ్లలో వరకట్న వేధింపుల కేసులు 110 నమోదయ్యాయి. 2023లో 50 కేసులు నమోదు కాగా, 2024లో 60 కేసులు నమోదయ్యాయి. వరకట్న వేధింపుల నేపథ్యంలో 2024లో ఒక మర్డర్ కేసు నమోదవగా, కట్నం వేధింపులను తట్టుకోలేక 2023లో ఇద్దరు, 2024లో ముగ్గురు మహిళలకు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

భూతగాదాల దాడుల్లో ఒకరి మృతి

ఊట్కూర్ మండలం చిన్నపొర్ల గ్రామంలో దాయాదుల మధ్య భూతగాదల నేపథ్యంలో గత జూన్ 14 జరిగిన దాడుల్లో రైతు గువ్వల సంజీవ్(28) మృతి చెందాడు. పొలం దగ్గర దాడి జరుగగా, కుటుంబ సభ్యులు 100కు డయల్ చేసినా పోలీసులు స్పందించకపోవడంతో రైతు ప్రాణం పోయిందని ప్రజాసంఘాలు ఆరోపించాయి. ఈ ఘటలో ఊట్కూర్ ఎస్‌ఐ శ్రీనివాస్, ఏఎస్‌ఐ సమీలను సస్పెండ్ చేశారు. ఈ ఘటనలో పలువురిపై కేసులు నమోదయ్యాయి.

మా పిల్లలకు చదువు చెప్పించండి

నారాయణపేట కస్తూర్బా పాఠశాల ముందు తల్లిదండ్రుల ఆందోళన

విద్యార్థి సంఘాల మద్దతు.. అంతర్ రాష్ట్ర రహదారిపై రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు

నారాయణపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లలకు చదువు చెప్పించాలని నారాయణపేటలోని కస్తూర్బా పాఠశాల వద్ద విద్యార్థినుల తల్లిదండ్రులు శనివారం ఆందోళనకు దిగారు. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల్లో ఒకరైన కాంట్రాక్ టీచర్ల సమ్మెతో విద్యార్థుల చదువు నిలిచి, భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు. పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘాలు తల్లిదండ్రుల ఆందోళనకు మద్దతు తెలిపాయి. విద్యార్థులను కలవనివ్వకుండా, ఆందోళన చేయనివ్వకుండా పోలీసులు అడ్డుతగలడాన్ని తప్పుపడుతూ యాద్గిర్ అంతర్ రాష్ట్ర రహదారిపై బైఠాయించి గంటపాటు రాస్తారోకో చేశారు. విద్యాశాఖ అధికారులు ఎవరూ రాకపోవడంతో పోలీసులు విద్యార్థులను కలిసేందుకు అనుమతిస్తామని చెప్పారు. కానీ విద్యార్థి సంఘాలు ఎందుకు వచ్చాయని ప్రశ్నించారు. అందుకు తల్లిదండ్రులు తాము రమ్మని చెప్పలేదని, వారే స్వచ్ఛందంగా వచ్చారన్నారు. విద్యాధికారులతో మాట్లాడి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పోలీసులు నచ్చజెప్పారు. దాంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సాయికుమార్, నరహరి, గౌస్, వెంకటేష్, సురేష్, పవన్, భాను, గోవింద్, బాలకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రుణ మంజూరు వేగవంతం చేయాలి

- జనవరి 15 నాటికి లక్ష్యం పూర్తి చేయాలి
- కలెక్టర్ విజయేందిరబోయి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్ నగర్ కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రుణ మంజూరును వేగవంతం చేసి, జనవరి 15 నాటికి లక్ష్యం పూర్తి చేయాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బ్యాంక్ లింకేజీ కింద ఆర్థిక సహాయం అందించడంలో జిల్లా వెనుకబడి ఉందన్నారు. రూ.381 కోట్ల రూపాయలకు గాను రూ.280 కోట్ల రుణం అందించినట్లు చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో గ్రామ సంఘాలు, మండల మహిళా సమాఖ్యలకు నూతన బైలాస్ గురించి డీసీఎం, ఏపీఎం, సీసీలకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కమ్యూనిటీ పెట్టుబడి నిధి, స్త్రీ నిధి రుణ రికవరీ మెరుగుపర్చాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రభుత్వం మహిళల కోసం వివిధ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆ మేరకు ఆయా మండలాల్లో చేట్టిన కార్యక్రమాలను సమీక్షించారు. సవరించిన మార్గదర్శకాల మేరకు స్త్రీ నిధి ద్వారా పాలిచ్చే గేదెల యూనిట్లు పూర్తి చేయాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు వినూత్న ఆలోచనలతో వైవిధ్య కార్యక్రమాలు చేపట్టి, జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కోరారు. బ్యాంక్ లింకేజీ రుణాలకు సంబంధించి ఎంసీపీలు బ్యాంకులకు సకాలంలో అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఆర్‌డీవో నర్సింహులు, పీడీ జోజప్ప పాల్గొన్నారు.

సాఫ్ట్ స్కిల్స్ ప్రముఖ పాత్ర

వర్క్‌షాప్‌లో పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనిర్సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉపాధి, వ్యాపార రంగాల్లో సాఫ్ట్ స్కిల్స్ ముఖ్యపాత్ర పోషిస్తాయని పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. వర్సిటీ ఫార్మసీ కళాశాల ఆడిటోరియంలో ఎంసీఏ, ఎంబీఏ సంయుక్తంగా సాఫ్ట్ స్కిల్స్, ఉద్యోగ అవకాశాలపై శనివారం నిర్వహించిన వర్క్ షాప్ ముగింపు కార్యక్రమనికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ప్రతీ రంగంలో విజయం సాధించాలంటే సాంకేతిక నైపుణ్యాలు మాత్రమే కాదని, మంచి సాఫ్ట్ స్కిల్స్ ఉండాలని చెప్పారు. ప్రశ్నలు అడగడం, ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం, వర్క్‌షాప్‌లు నిర్వహించడం ద్వారా సాఫ్ట్ స్కిల్స్ మెరుగుపడతాయని చెప్పారు. అనంతరం మ్యాజిక్ రెడ్బస్ తాఫిక్‌అహ్మద్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు అవసరమైన స్కిల్స్‌ను ఏవిధంగా పెంపొందించుకోవాలో, రెజ్యూమ్ ఎలా తయారు చేయాలో వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, విభాగధిపతులు డాక్టర్ గౌస్ మొయినొద్దీన్, డాక్టర్ నాగసుధ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ అర్జున్ కుమార్, డాక్టర్ అరుంధతి రెడ్డి, డాక్టర్ సబిత, డాక్టర్ జావేద్‌ఖాన్ విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వేపై ఇంత నిర్లక్ష్యమా?

- అదనపు కలెక్టర్ మోహన్‌రావు ఆగ్రహం

కోయిలకొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోయిలకొండ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించడంలో అధికారుల నిర్లక్ష్యంపై అదనపు కలెక్టర్ మోహన్‌రావు అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని ఆచార్యపూర్‌లో సర్వేను మోహన్‌రావు పరిశీలించారు. సర్వే నిర్వహణను మండల అధికారులు పర్యవేక్షించడం లేదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే నిర్వహణ ఎందుకు ఆలస్యం అవుతుందని అడిగారు. ఇప్పటి వరకు కేవలం 30 శాతం మాత్రమే సర్వే చేస్తే ఎలా అని ప్రశ్నించారు. అనంతరం మండంలోని ఆచార్యపూర్‌లో ఇసుక అక్రమంగా రవాణా చేయడంపై ఆరా తీశారు. ఇసుక రీచ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో మైనింగ్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ పోరుకు

మొదలైన ప్రక్రియ


- నూతన రిజర్వేషన్‌తోనే ఎన్నికల నిర్వహణ
- త్వరలోనే బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్‌కు టెండర్
- మహబూబ్‌నగర్ జిల్లాలో 441 జీపీలు, 5,27,302 మంది ఓటర్లు

7



హన్వాడ మండలం కొత్తపేట గ్రామ పంచాయతీ కార్యాలయం

గొంతులో అన్నం ముద్ద ఇరుక్కొని వృద్ధుడి మృతి



ఈశ్వరయ్య (ఫైల్)

బాలానగర్, డిసెంబరు 21 : గొంతులో అన్నం ముద్ద ఇరుక్కొని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన శనివారం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఉడిత్యాల గ్రామానికి చెందిన వృద్ధుడు బండ ఈశ్వరయ్య (84) మధ్యాహ్నం తన కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్నాడు. ఈ క్రమంలో గొంతులో అన్నం ముద్ద ఇరుక్కొని అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అతని భార్య చెన్నమ్మ, కుమారుడు యాదయ్య గ్రామంలో ఉన్న ఆర్‌ఎంపీ దగ్గరకు తీసుకెళ్లారు. పరీక్షించిన ఆయన అప్పటికే మృతి చెందినట్లు చెప్పాడు.

పెరిగిన దిగుబడి

తగ్గిన ధరలు

కంది ధరల తగ్గుదలతో రైతుల ఆందోళన

మరుసటి రోజు ఈ నామ్ టెండర్‌లో విక్రయించుకునే వెసులుబాటు

7

ఉచిత కుట్టు మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి ఇందిరమ్మ మహిళా శక్తి ద్వారా మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు అందిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శంకరచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ మహిళలు ఈనెల 31వ తేదీ వరకు టీజీవోబీఎంఎం.సీజీజీ. సీవోవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నిరుపేద, వితంతువు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. తెల్ల రేషన్‌కార్డు లేదా ఆహారభద్రతా కార్డు కలిగి ఉండి, గ్రామీణ ప్రాంతాల వారు రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతం వారు రూ.రెండు లక్షలు మించకుండా ఆదాయ ధ్రువపత్రం ఉండాలన్నారు. 18-55 ఏళ్ల వారు అర్హులని, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా లేదా, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ ద్వారా టైలరింగ్ సర్టిఫికెట్, కనీసం ఐదో తరగతి విద్యార్హత ఉండాలని తెలిపారు.

హామీని అమలు చేయాలి

తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య



రాష్ట్ర మహాసభల పోస్టర్లు విడుదల చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

నారాయణపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): 317 జీవో బాధితులకు ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేసి స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం నారాయణపేట గ్రౌండ్ ప్రభుత్వ పాఠశాల వద్ద ఫెడరేషన్ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను నాయకులు విడుదల చేసి మాట్లాడారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. నల్గొండలో ఈనెల 28, 29, 30 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభల్లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివరాములు, బాలాజీ, భీమయ్య కృష్ణగౌడ్, రవికుమార్ తదితరులున్నారు.

నేటి నుంచి వాలీబాల్ జాతీయ స్థాయి క్రీడలు


క్రీడాకారులతో తహసీల్దార్ శ్రీనివాసులు

కోస్గి రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో ఆదివారం నుంచి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభించనున్నామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జాతీయ స్థాయి అండర్-19 విభాగం క్రీడలు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 26 వరకు కొనసాగుతాయన్నారు. లీగ్ మరియు నాకౌట్ పద్ధతిలో కొనసాగే ఈ క్రీడలకు దేశంలోని అన్ని రాష్ట్రాల వాలీబాల్ క్రీడాకారులు పాల్గొంటారన్నారు. క్రీడాకారులకు అన్నిరకాల సదుపాయాలు పలు పాఠశాలల్లో కల్పించినట్లు ఆయన తెలిపారు. క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎంపీ డీకే.అరుణ, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కాడా చైర్మన్ వెంకటరెడ్డి, కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్ తదితర అధికారులు హాజరవుతారన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పూజలు

● 12వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల నిరసన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం డిసెంబరు 21 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మా దేవుడు అంటూ సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు శనివారం ధర్నా చౌక్‌లో వినూత్న రీతిలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పూజలు చేస్తూ.. పాటలు పాడుతూ భజనలు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు హన్మకొండ సభలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరుతూ సమగ్ర శిక్ష జేఏసీ ఉద్యోగులు భజనలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమం శనివారంతో 12వ రోజుకు చేరింది. జేఏసీ నాయకులు మాట్లాడుతూ పాలమూరు జిల్లా సీఎం సొంత జిల్లా కాబట్టి తమపై దయ ఉంచి సమస్యలు పరిష్కరించాలని కోరారు. జేఏసీ నాయకులు చంద్రశేఖర్, యాదగిరి ఖాజామైనోద్దీన్, విక్రమ్, ఇంతియాజ్, శంకరమ్మ, వేణు, హర్ష, మొగులయ్య, గంగమ్మ పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

మద్దూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్దూర్ నుంచి లింగాల్‌చెడ్ వరకు గల 15.8 కి.మీ సింగిల్ రోడ్డును డబుల్‌గా మార్చేందుకు ప్రభుత్వం రూ.39 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణలు సక్రమంగా సాగడం లేదని రోడ్డు పొడవునా ఉన్న మలుపులు, ఎత్తుపల్లాలను నామమాత్రంగా సరి చేస్తున్నారని, పలుచోట్ల ప్రమాదభరితంగా ఉన్న మలుపులు అలాగే వదిలివేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో డీఈ రాములు స్పందించారు. ఈ మేరకు శనివారం రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రమాదభరితంగా ఉన్న మలుపులను సరి చేయాలని, అలాగే ఎత్తు రోడ్డు తొలచి సమాంతరంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనులు నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు రమేశ్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ డీఈ రాములును కోరారు.


అధికారి నుంచి గౌరవ డాక్టరేట్ పట్టా అందుకుంటున్న జ్యోతి

పాలమూరు వాసి జ్యోతికి డాక్టరేట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి చెందిన ఎస్.జ్యోతికి గౌవర డాక్టరేట్ లభించింది. నవపేట మండలం లోకిరేవు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఎస్.జ్యోతి రాజస్థాన్ రాష్ట్రం మేవార్ యూనివర్సిటీలో పదో తరగతి విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఇంటి వాతావరణం అనే అంశంపై అధ్యాయనం చేసింది. దీంతో యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో శనివారం డాక్టరేట్ పట్టా అందుకున్నారు. జ్యోతి ఇప్పటికే ఎంఎస్సీ సైకాలజీ, ఎంఏ ఫిలాసఫీ, ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేశారు. నెట్, సెట్ కూడా అర్హత సాధించారు.



ఆర్‌ఎంపీ క్లినిక్‌ను మూసివేస్తున్న జిల్లా వైద్యాధికారులు

ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్

మూసాపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండల కేంద్రంలో ఆర్‌ఎంపీ క్లినిక్‌లో అర్హతకు మించి వైద్యం చేస్తున్నాడని శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్వర్ అనే ఆర్‌ఎంపీ వైద్యుడు అర్హతకు మించిన ఇంజెక్షన్లు, ఐవీ సైలెన్స్, యాంటిబయోటిక్ ట్యాబ్లెట్లు ఇస్తున్నారని నిర్ధారించుకొని క్లీనిక్‌ను సీజ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి గంగసాని మంజుల పాల్గొన్నారు.

మద్దూర్‌లో ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

మద్దూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప నామ స్మరణతో శనివారం నారాయణపేట జిల్లా మద్దూర్ మారు మోగింది. అఖిల భారత అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణ శివారులో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప ఆలయంలో మహా పడిపూజను నిర్వహించారు. స్థానిక కొట్ట ఆంజనేయ స్వామి ఆలయం నుంచి పట్టణ పురవీధుల గుండా కలశ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మహా పడిపూజ జరిగింది. పూజలో భాగంగా భాష్యం పాఠశాల విద్యార్థులు చేసిన కళానృత్యం చూపరులను ఆకట్టుకుంది. పూజ అనంతరం మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. గురుస్వాములు శ్రీనివాస్‌రెడ్డి, చికిని మహేశ్, విష్ణుమూర్తి, సత్యనారాయణగౌడ్, విజయ్. రామకృష్ణల ఆధ్వర్యంలో జరిగిన మహా పూడిపూజలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



మద్దూర్‌లో కలశ పూజ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, పంచామృతాభిషేకం చేస్తున్న గురుస్వాములు


రైస్ మిల్లును పరిశీలించిన ఆర్డీవో మాధవి

ఉప్పరిపల్లిలో రైస్ మిల్లును పరిశీలించిన ఆర్డీవో

ఉప్పునుంతల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని ఉప్పరిపల్లి గ్రామంలో గల రైస్ మిల్లును శనివారం డీటీ కేశమ్‌తో కలిసి అచ్చంపేట ఆర్డీవో మాదవి పరిశీలించారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన వడ్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అదే విధంగా మిల్లులో ధాన్యం నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేంచిన సీఎంఆర్‌ను పంపించాలని మిల్లు యాజమాన్యానికి సూచించారు.

నాసికరం విత్తనాలు ఇచ్చారు

వంగూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధిత రైతు

వంగూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నాసిరకం పల్లి విత్తనా లు వేయడం వల్ల వేరుశనగ పైరు పెరగడం లేదని విక్రయదారునిపై రైతు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మండలంలోని పోల్కంపల్లి గ్రామానికి చెందిన రైతు జంగయ్య కల్వకుర్తి పట్టణ సమీపంలో కైలాస గుట్ట వద్ద ఉన్న ఓ పల్లి మిల్లు వ్యాపా రి వద్ద అక్టోబరులో నాలుగు క్వింటాళ్ల వేరశనగ విత్తనాలు కొని ఐదు ఎకరాల లో సాగు చేశాడు. కే6 విత్తనాలు అడిగితే నాసిరకం విత్తనాలు ఇవ్వడం తో చేను పెరగక చచ్చిపోతుందని రైతు జంగయ్య తెలిపాడు. ఈ మేరకు పల్లి వ్యాపారి రఘుపై శనివారం రైతు జంగయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదును సంబంధిత వ్యవసాయశాఖ మండల అధికారికి పంపించి వారు ఇచ్చిన రిపోర్టును బట్టి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహేందర్ తెలిపారు.

కస్తూర్బాలో చన్నీటి స్నానాలు

కేజీబీవీల్లో అటకెక్కిన సోలార్ హీటర్లు

అలంపూర్ చౌరస్తా, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా బాలికల విద్యాలయాలలో చదివే విద్యార్థుల సౌకర్యాలపై ప్రభుత్వాల నిర్లక్ష్యపు ధోరణి కొనసాగుతూనే ఉంది. కనీస వసుతుల కోసం ఏళ్లతరబడి ఎదురు చూస్తూనే ఉన్నారు. పరికరాలున్న వాడుకోలేని స్థితిలో కొన్ని పాఠశాల లు ఉన్నాయి. మరికొన్ని చోట్ల మరమ్మతులకు నోచుకోక ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలం, చలికాలంలో పిల్లలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎముకలు కొరికే చలిలో చన్నీటితో స్నానం చేయాలంటే గజగజా వణికిపోతున్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో 13 మండలాలు ఉన్నాయి. ఎర్రవల్లి మినహా మొత్తం 12 కేజీబీవీలు ఉన్నాయి. వీటిలో అలంపూర్, మానవపాడు, వడ్డేపల్లి, అయిజ, గద్వాల, గట్టు మండలాల కేజీబీవీలు కళాశాలలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. ఇలా మొత్తం జిల్లాలో 3,614 మంది బాలికలు కేజీబీవీల్లో చదువుతున్నారు. చలికాలంలో చన్నీటితో స్నానం చేస్తే రోగాల బారిన పడతారన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయాలు వెచ్చించి పాఠశాలకో వెయ్యి లీటర్ల సామార్థ్యంతో సోలార్ వాటర్ హీటర్లను ఏర్పాటు చేశారు.

పరికరాలున్నా పట్టింపేది..?

2017లో పునారుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో జిల్లాలోని 10 కేజీబీవీలలో సౌరశక్తితో నడిచే హీటర్లను అమర్చారు. అమర్చిన ఏడాది నుంచే మొరాయించడం మొదలుపెట్టాయి. కరోనాకు ముందు అడపాదడప నడిచినా ఆ తర్వాత ఎక్కడ పని చేయడంలేదని 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో తేలింది. ధరూరు కేజీబీవీలో మాత్రం ఓ దాత ఇచ్చిన గీజర్లతో కాలం వెల్లదీస్తున్నారు. మిగతచోట్ల చన్నీటితో స్నానం చేస్తున్నారు.



మానవపాడు కేజీబీవీ పాఠశాలలో ఐదేళ్లుగా పని చేయని సోలార్ వాటర్ హీటర్

మరమ్మతుల్లేవ్.. అమరికల్లేవ్..

జిల్లాలో ఉన్న 12 కేజీబీవీ పాఠశాలలకు సోలార్ హీటర్లు మంజురయ్యాయి. కానీ సొంత భవనాలు ఉన్నవాటికి మాత్రమే మొదట అమర్చారు. మిగతావి రిజర్వులో ఉంచారు. 2022లో అలంపూర్ కేజీబీవీ నూతన భవనంలోకి మారడంతో పరికరాలను తెచ్చారు. కానీ నేటికి అమర్చలేదు. రాజోలి, కేటీదొడ్డి పాఠశాలలకు సొంతభవనాలు లేకపోవడంతో పరికరాలను ఇవ్వలేదు. ఇక మిగత చోట్ల పరికరాలు అమర్చినా అవి మరమ్మతులకు నోచుకోలేదు. పిల్లలు చన్నీటి స్నానాలు చేయాలంటేనే హడలిపోతున్నారు. చన్నీటితో స్నానాలు చేయడం వల్ల కొంత మంది పిల్లలు జలుబు, ముక్కుదిబ్బడ, తలనొప్పి, జ్వరాలతో బాధపడుతున్నారు. గీజర్లు ఇవ్వాలని అయా ఎస్‌వోలు కోరినా ఇంత వరకు దిక్కులేదు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



గతంలో ఇచ్చిన సోలార్ హీటర్లు పని చేయడంలేదు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులు తెలియజేస్తున్నాం. ప్రస్తుతం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ప్రతీ పాఠశాలకు అరు గీజర్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా ఆర్‌వోప్లాంట్‌లు, సీసీ కెమెరాలకు కూడా ప్రతిపాదనలు పంపాం.

\- ఫర్జానాబేగం, జీసీడీవో

వేడినీటి సౌకర్యం కల్పించాలి



మా పాఠశాలలో 385 మంది బాలికలు ఉన్నారు. 2022లో సోలార్ హీటరు మంజూరు చేశారు. కానీ నేటికి అమర్చలేదు. పలుమార్లు ఉన్నతాధికారులకు తెలిపాం. చలికాలం కావడంతో వేడినీటి సౌ కర్యం కల్పించాలి. చలికి బయపడి విద్యార్థినులు సాయంత్రం పూట స్నానాలు చేస్తున్నారు.

\- కృష్ణవేణి ఎస్‌వో అలంపూరు కేజీబీవీ

మర్రి జంగిరెడ్డికి కన్నీటి వీడ్కోలు


తండ్రికి అంత్యక్రియులు నిర్వహిస్తున్న మర్రిజనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి పితృవియోగం జరిగింది. ఆయన తండ్రి మర్రి జంగిరెడ్డి(84) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని శనివారం ఉదయం స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని నేరేళ్లపల్లికి తీసుకొచ్చారు. మర్రి జంగిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించేందుకు మర్రిజనార్దన్‌రెడ్డి అభిమానులు, బంధువులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సాయంత్రం అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. మర్రి జనార్దన్‌రెడ్డి ఆయన చితికి నిప్పంటించారు.

ప్రముఖుల సంతాపం

మర్రి జనార్దన్‌రెడ్డి పితృవియోగం పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు, నాగం జనార్దన్‌రెడ్డిలు ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. అంత్యక్రియల్లో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, అంజయ్య యాదవ్, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, బైకాని శ్రీనివాస్‌యాదవ్, అర్థం రవి, తిమ్మాజిపేట పాండు, వట్టెం తిరుపతిరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్టు టీచర్ల సమ్మెకు తపస్ మద్దతు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమ్మెకు ఉపాధ్యాయ సంఘం తపస్ మద్దతు తెలిపింది. శనివారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఆవరణలో ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో 48 గంటల సమ్మె శిబిరాన్ని తపస్ జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చాలీచాలనీ వేతనాలతో వెట్టిచాకిరి చేయించుకోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమలో తపస్ జిల్లా నాయకులు, కాంట్రాక్టు ఉపాధ్యాయ సంఘం నాయకులు ఉన్నారు.

త్వరలో దివ్యాంగులకు కృత్రిమ చేతులు

కొల్లాపూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెయ్యిలేని నిరుపేద దివ్యాంగులకు రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ శాఖ ఆధ్వర్యంలో జనవరిలో హైదరాబాద్‌లో బ్యాటరీతో పనిచేసే ప్రోస్థటిక్ హ్యాండ్‌ను రత్నగిరి ఫౌండేషన్ సహకారంతో పంపిణీ చేస్తామని రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ తెలిపారు. శనివారం కొల్లాపూర్ పట్టణంలోని రత్నగిరి ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న దివ్యాంగులు మోచేతి కింద మణికట్టుపైన చేతి ఉన్న వారు కొల్లాపూర్ పట్టణంలోని మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో ఉన్న రత్నగిరి ఫౌండేషన్ కార్యాలయం నేరుగా వచ్చి ఈనెల 23, 24వ తేదీలలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. వివరాలకు 9177050558ను సంప్రదించాలని తెలిపారు.

రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం

వీపనగండ్ల, డిసెంబరు 21, (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఉపయోగపడే పనులకు ఉపాధి హామీ పథకంలో ప్రాధాన్యత ఇవ్వాలని అడిషనల్ డీఆర్‌డీవో నాగేంద్రం తెలిపారు. శనివారం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలంలోని సంగినేనిపల్లి, కల్వరాల గ్రామాల్లో పర్యటించారు. సంగినేనిపల్లిలో ఉపాధి పనులు ప్రారంభించారు. అనంతరం ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ల్యాండ్ లెవలింగ్, పశువుల పాగా వంటి రైతులకు ప్రయోజనం చేకూరే పనులు చేపట్టాలన్నారు. మార్చి వరకు అయిదు నెలల కాలంలో చేయాల్సిన పనుల గురించి తెలిపారు. పని కోరిన ప్రతీఒక్కరికి పని కల్పించాలని అన్నారు. ఉపాధి పనుల నిర్వహణలో అక్రమాలు జరగకుండా చూడాలని ఏపీవోకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


పశువులపాక పనులు ప్రారంభిస్తున్న లబ్ధిదారురాలు

ఏఎన్‌ఎంలకు రాత పరీక్ష రద్దు చేయాలి

- మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఫసియొద్దీన్

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న కాంట్రాక్టు ఏఎన్‌ఎంలకు రాత పరీక్ష రద్దు చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. ఫసియొద్దీన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో మానవ హారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఫసియొద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి రాత పరీక్షను నిలిపివేసి యూనియన్‌లతో చర్చలు జరపాలని కోరారు. లేని పక్షంలో అసెంబ్లీని ముట్టడించడంతో పాటు నిరవధిక సమ్మెకు దిగుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, సహాయ కార్యదర్శి రామయ్య కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు పర్వీన్, సుగుణ, బాలమణి, శ్రీవిద్య, సావిత్రి, అరుణ, పద్మ, అలివేల, జ్యోతి, వనజ, హైమావతి పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలో మానవహారంతో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు

క్రైం కార్నర్

గుర్లపల్లిలో అగ్నిప్రమాదం

- నగదు, ఆభరణాలు దగ్ధం



కాలిపోతున్న గుడిసె

మక్తల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మక్తల్ మండలంలోని గుర్లపల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి రెండు గుడిసెలు పూర్తిగా దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గుర్లపల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం సందప్ప, మొగిలప్ప గుడిసెలకు అకస్మాత్తుగా నిప్పంటుకుంది. రెండు ఇళ్లకు తాళం వేసి ఉండటంతో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఏర్పడ్డాయి.

ఈ సంఘటనలో సందప్ప ఇంట్లో రూ.2.60లక్షల నగదు, మొగిలప్ప గుడిసెలో రూ.2.10లక్షల నగదు, ఆరు తులాల బంగారం, వంద తులాల వెండి ఆభరణాలు కాలిపోయాయి. వీటితో పాటు రెండు ఇళ్లలో ఉన్న నిత్యావసర సరకులు, వంట సామగ్రి, బియ్యం, ఇతర వస్తువులు మంటల్లో కాలిపోయాయి. శనివారం పడమటి అంజనేయ స్వామికి నైవేద్యం సమర్పించేందుకు ఇరువురు తమ గుడిసెలకు తాళం వేసి మక్తల్‌కు రావడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం తమను ఆదుకొని ఆర్థిక సాయం అందించాలని బాధిత కుటుంబాలు కోరారు.

కుటుంబ కలహాలతో

మనస్తాపం చెంది మహిళ ఆత్మహత్య

కొల్లాపూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో నెలకొన్న కలహాలతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గడిచిన నాలుగు సంవత్సరాల క్రితం రాజస్థాన్ రాష్ట్రం నింబావాసి గ్రామానికి చెందిన రాజ్‌సింగ్ అనే వ్యక్తి బతుకుదెరువు కోసం కొల్లాపూర్ పట్టణానికి వచ్చాడు. పట్టణంలో నూతన గృహ నిర్మాణాలకు రైలింగ్ పనులు చేస్తూ బతుకుదెరువు కొనసాగిస్తున్నాడు.

గడిచిన నాలుగు నెలల క్రితం రాజ్‌సింగ్ భార్య జుఖ కవార్ కొల్లాపూర్‌కు వచ్చి భర్తతో పాటే కొల్లాపూర్ పట్టణంలోని సత్యసాయి టాకీస్ సమీపంలో అద్దె గృహంలో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. గడిచిన కొన్ని రోజుల నుంచి భర్త రాజ్ సింగ్ పనులకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండటంతో ఇద్దరి మధ్య కలహాలతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో జుఖ కవార్ (28) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హృషికేష్ తెలిపారు.

ద్విచక్ర వాహనంపై నుంచి పడి వ్యక్తి దుర్మరణం

మన్ననూర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని మన్ననూరులోని శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం కింద పడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలవ్వగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడిన దుర్ఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా గండీడ్ మండలం మూకనూరు గ్రామానికి చెందిన అరవింద్ (35), ఈశ్వర్ అనే యువకులు ద్విచక్ర వాహనంపై శనివారం ఉదయం శ్రీశైలంకు బయలు దేరారు. మన్ననూరు గ్రామం లింగమయ్య ఆలయ సమీపంలోని ఘాటురోడ్డు మలుపు వద్ద వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనానికి ఆకస్మికంగా కుక్క అడ్డురావడంతో తప్పించే క్రమంలో అదుపు తప్పి వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం కిందపడింది. ప్రమాదంలో వాహనం నడుపుతున్న అరవింద్ (35) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.

మరో వ్యక్తి ఈశ్వర్ చేతికి ఫ్యాక్చర్ అయింది. గాయపడిన ఈశ్వర్‌ను 108లో అచ్చంపేట సివిల్ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని అచ్చంపేట సివిల్ ఆసుపత్రి ఆవరణలో గల మార్చురీ గదికి తరలించారు. ప్రమాద ఘటనపై విచారణ నిర్వహించి కేసు నమోదు చేస్తునట్లు అమ్రాబాద్ ఎస్‌ఐ రజిత తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

అలంపూరుచౌరస్తా, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని బైరాపురం గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. గ్రామశివారులో అలంపూరు రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో శనివారం గుర్తుతెలియని శవాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఉండవల్లి ఇన్‌చార్జి ట్రైనీ ఎస్సై సతీష్‌కుమార్ రెడ్డి, ఏఎస్ సుబ్బారెడ్డి తమ సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. బనియన్ మినహా ఒంటిపై మరే ఇతర దుస్తులు లేకుండా రక్తపు మరకలతో పడి ఉండటంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం అధికారులు, ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ సంఘటన స్థలానికి చేరుకుని అవసరమైన ఆధారాలను సేకరించి స్థానికులను విచారించారు. మృతుడి తలకు బలమైన గాయాలు, ఎడమ చేతి వేలుకు ఉంగరం, అదే వేలుకు పాతబడిన గాయాన్ని గుర్తించారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ సత్యనారాయణ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ...

అమరచింత, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పొలం గెట్ వద్ద పక్క పొలం వ్యక్తి గొడవ పడటంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం అమరచింతలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీకృష్ణ నగర్‌కు చెందిన అంబటి బాలస్వామి తన పక్క పొలం వద్ద ఉన్న చంద్రన్నతో కొన్నాళ్లుగా పొలం గెట్టు పంచాయతీ ఉండేదని తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 14వ తేదీన ఇరువురి మధ్య పొలం గట్టుకు సంబంధించిన గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన బాలస్వామి 18వ తేదీ పొలం వద్ద ఉన్న గడ్డి మందును తాగాడు. అపస్మారక స్థితిలో పడిన అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతడి పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఆసుపత్రిలోనే మృతి చెందాడు.

బాలస్వామి మృతికి కారణమైన పక్క పొలానికి చెందిన చంద్రన్న, ఆయన తండ్రి బుచ్చన్న, అతని మామ కురుమన్నలు తమ తండ్రి మరణానికి కారణమని మృతుడి కొడుకు రమేష్ అమరచింత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ప్రైవేటు బస్సులో నగదు చోరీ : కేసు నమోదు

రాజాపూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల పరిధిలోని రంగారెడ్డిగూడ గ్రామంలో గల ఓ ప్రైవేటు బస్సులో నగదు చోరీ జరిగిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై కే రవి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రంగారెడ్డిగూడ గ్రామం స్థానిక జాతీయ రహదారి 44 పక్కన ఉన్న కృతుంగా హోటల్ దగ్గర తమిళనాడు రాష్ట్రం తిరుపూర్ జిల్లా మెట్టు పాలాయంకు చెందిన వెంకటేష్ వ్యాపారం నిమిత్తం హైదరాబాద్ నుంచి తిరుగు ప్రయాణంలో తమిళనాడుకు ఆరెంజ్ ట్రావెల్స్ ప్రైవేటు బస్సులో ప్రయాణం చేస్తూ శుక్రవారం రాత్రి భోజనం కోసం హోటల్ దగ్గర ఆపడంతో తన నగదు ఉన్న బ్యాగ్‌ను తను కూర్చున్న సీటులో ఉంచి తినడానికి వెళ్లాడు. అనంతరం చూసుకోవడంతో బ్యాగ్, అందులో ఉన్న రూ.2,95,000 చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. బాధితుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

ఆత్మకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోడి పందేల స్థావరాలపై దాడులు నిర్వహించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆత్మకూరు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని మోట్లంపల్లి గ్రామ శివారులోని జములమ్మ దేవాలయం పక్కన కోడి పందాలు ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆరు ద్విచక్ర వాహనాలు, రెండుఫోన్లు, రూ.500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పంచాయతీ పోరుకు

మొదలైన ప్రక్రియ

- నూతన రిజర్వేషన్‌లోనే ఎన్నికల నిర్వహణ
- త్వరలోనే బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్‌కు టెండర్
- అన్ని వివరాలు 25లోగా టీపోల్‌లో నమోదు
- మహబూబ్‌నగర్ జిల్లాలో 441 జీపీలు... 3838 వార్డులు, 5,27,302 ఓటర్లు
- ఎన్నికల ప్రత్యేక అధికారులను నియమించిన కలెక్టర్

● ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం



ప్రభుత్వం ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా తమ శాఖ సిద్ధంగా ఉంది. అందుకు గ్రామ స్థాయిలోని పోలింగ్ కేంద్రాలను ఫైనల్ చేశాం. బ్యాలెట్ పేపర్ టెండర్ నోటిఫికేషన్ ఎన్నికల కమిషన్, పంచాయతీ రాజ్ కమిషన్ నుంచి రాగానే పిలుస్తాం.

- పార్థసారథి, డీపీవో

● నూతన రిజర్వేషన్‌లోనే ఎన్నికలు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పంచాయతీ ఎన్నికలు పదేళ్లపాటు ఒకే రిజర్వేషన్ ఉంటుందని ప్రకటించి ఎన్నికలు నిర్వహించింది. రాష్ట్రంలో ప్రభుత్వ మార్పు జరగకపోతే పాత రిజర్వేషన్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించే వారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి వస్తే కులగణన చేపడ్తామని ఆ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. ఆ మేరకు రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టింది. దీని ప్రకారం రిజర్వేషన్లు మారే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల రాష్ట్ర మంత్రి సైతం నూతన రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు ముగ్గురు సంతానం కలిగిన వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయడం పట్ల వెసులుబాటు కల్పించినట్లుగా తెలుస్తుంది.

● బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్‌కు టెండర్

ఎన్నిక ప్రక్రియకు కీలకమైన బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ చేయడానికి అధికారులు టెండర్లు పిలువనున్నారు. ఇప్పటికే జిల్లాకు ఎన్నికల సామగ్రి 50శాతానికి పైగా చేరింది. అందులో ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారులకు సంబంధించిన అంశాలతో ఉన్న ప్రింటింగ్ పేపర్లు వచ్చాయి. త్వరలోనే అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నారు.

పంచాయతీ పోరుకు ఎన్నికల ప్రక్రియ మొదలైంది. కొత్త రిజర్వేషన్‌లోనే ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేస్తోంది. అందులో భాగంగానే త్వరలోనే బ్యాలెట్ పే పర్ ప్రింటింగ్‌కు టెండరు పిలువనున్నారు. ఇందుకు ఎన్నికల కమిషన్, పంచాయతీ రాజ్ కమిషన్ నుంచి నోటిఫికేషన్ రావడమే తరువాయి. ఈ పాటికే జిల్లాకు ఎన్నికల సామగ్రి 50శాతానికి పైగా చేరుకున్నది. అందులో ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారులకు సంబంధిం చిన అంశాలతో ఉన్న ప్రింటింగ్ పేపర్లు ఉన్నాయి. అయితే, ఇటీవల కలెక్టర్ పంచాయతీ ఎన్నికలకు సంబం ధించి ప్రతీ విభాగానికి ఒక జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించిన విషయం తెలిసిందే. ఏది ఏమైనా పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలు కావడంతో అధికారులు చకచకా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.



మహబూబ్‌నగర్ జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల సామగ్రి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామ పంచాయతీలు కొనసాగుతున్నాయి. దీంతో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదని గుర్తించిన ప్రభుత్వం జనవరి చివరి వారం, లేదా ఫిబ్రవరి నెలలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులను సన్నద్ధం చేస్తున్నది. అందులో భాగంగానే ఈ నెల 7 నుంచి 12 వరకు మండలాల్లో ఓటరు ముసాయిదా తుది జాబితాను ప్రదర్శించారు. 16న మహబూబ్‌నగర్ కలెక్టర్ అప్రూవల్ తీసుకుని 17న మండలాల్లో ప్రదర్శించారు. 3838 పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అభ్యంతరాలు ప్రజల నుంచి రాకపోవడం వల అధికారులు ఎన్నికలను అదే పోలింగ్ కేంద్రాలలో నిర్వహించనున్నారు. ఎన్నికల నాటికి ఒకటి లేదా రెండు కేంద్రాల మార్పులు ఉండవచ్చని అధికారులు అంచనాకు వచ్చారు. జిల్లాలో 441 జీపీల్లో 3838 వార్డులు ఉన్నాయి. అందులో 5,27,302 ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 2,62,558 ఉండగా, మహిళలు 2,64,736 ఓటర్లు ఉన్నారు. పురుషుల ఓట్లకంటే మహిళల ఓట్లు 2178 అధికంగా ఉన్నాయి. ఇతరుల ఓట్లు 8 ఉన్నాయి.

● ప్రత్యేక అధికారులను నియమించిన కలెక్టర్

గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రభుత్వం ఎప్పుడైనా నిర్వహించే అవకాశాలు ఉండటంతో కలెక్టర్ విజయేందిర బోయి పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రతీ విభాగానికి ఒక జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించింది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని ఇటీవల నిర్వహించిన అధికారుల సమీక్షలో ఆదేశించారు.

● టీపోల్‌లో అప్‌లోడ్

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణకు ప్రత్యేకంగా నిర్ణయ అనే యాప్‌ను రూపొందించింది. ఆ యాప్‌లో టీ పోల్ పోర్టర్‌లో ఓటరు జాబితా వివరాలు, పోలింగ్ కేంద్రాలు వివరాలు ఈ నెల 25లోగా నమోదు చేయాలని ఆదేశించింది. నూతన ఓటరు ప్రక్రియ కోసం ఎలక్టోరల్ అధాకారులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే నాటికి నూతన ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు చేసుకునే వెసలుబాటును కల్పించింది.

పెరిగిన దిగుబడి.. తగ్గిన ధరలు

- కంది ధరలు తగ్గుతున్నాయి....
- వివిధ రాష్ట్రాల్లో దిగుబడి పుంజుకుంటోంది
- మరుసటి రోజు ఈ నామ్ టెండర్‌లో విక్రయించుకునే వెసులుబాటు

నారాయణపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా కంది ధరలు దగ్గుతున్నాయి. వివిధ రాష్టాలలో దిగుబడి అధికంగా ఉండి విక్రయాలకు వస్తుండటంతో నాలుగు రోజులుగా కంది ధరలు దిగుతూ వస్తున్నాయి. నారాయణపేట జిల్లాలో కంది ధరలు తగ్గుతున్నాయి. కంది క్వింటాల్ వెంబడి మూడు వేల రూపాయల వరకు తగ్గింది. ముఖ్యంగా మహారాష్ట్ర, కర్ణాటకలలో కంది దిగుబడి అధికంగా వస్తుండటంతో ధరలు తగ్గుతున్నాయని మార్కెట్ యార్డు ఖరీదు దారులు పేర్కొంటున్నారు. కంది ధరలు తగ్గడంతో ఇటీవల నారాయణపేటలో రైతులు అంతర్రాష్ట్ర రహదారిపై బైటాయించి ఆందోళన వ్యక్తం చేస్తూ మార్కెట్ కార్యాలయాన్ని ముట్టడించిన నేపథ్యంలో.. అధికారులు అప్రమత్తమై క్షేత్ర స్థాయిలో కంది లాట్‌లు పరిశీలించి గ్రేడ్‌ల వారిగా గుర్తించేందుకు శనివారం శ్రీకారం చుట్టారు.

ఈ నామ్ ద్వారా టెండర్లు అయిన కంది ధరలు రైతులకు నచ్చకపోతే మరుసటి రోజు కందిని టెండర్లలో ఉంచి అమ్ముకునే వెసులుబాటు ఉందని, ఏ రైతు కూడా బలవంతంగా కంది సరకును విక్రయించుకోవద్దని మార్కెట్ కార్యదర్శి భారతి, సూపర్‌వైజర్ లక్ష్మణ్‌లు సూచిస్తున్నారు.



పేట మార్కెట్ యార్డులో కంది లాట్స్ నాణ్యతను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ లక్ష్మణ్



పేట మార్కెట్ యార్డులో ఎర్రకందులు ఆరబెడుతున్న రైతులు

పేట యార్డులో 689 కంది లాట్‌లు, 2203.04 క్వింటాళ్లు

నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు శనివారం విక్రయానికి వచ్చిన కంది లాట్‌లు 689 ఉన్నాయి. అందులో క్వింటాల్ ధర రూ. 7550 లోపు 29 లాట్‌లు 120.54 క్వింటాళ్లు నాలుగు శాతం ఉన్నాయి. క్వింటాల్ ధర రూ.7551 నుంచి రూ.8000 వరకు 139 లాట్‌లు 686.98 క్వింటాళ్లు 22.82 శాతం, క్వింటాల్ ధర రూ 8001 నుంచి రూ. 9000 వరకు 521 లాట్‌లు 2203.04 క్వింటాళ్లు 73.18 శాతం ఉన్నాయి. దాంతో కంది 689 లాట్‌లకు 3010.56 క్వింటాళ్లు విక్రయానికి రాగా అధికంగా 73.18 శాతం 521 లాట్‌లు 2203.04 క్వింటాల్ ధర రూ 8001 నుంచి రూ. 9000 వరకు పలికింది.

కార్పొరేషన్‌తో అభివృద్ధి శరవేగం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెద్దఎత్తున నిధులు
- మెరుగుపడనున్న వసతులు, విలీన గ్రామాలకు పన్నుల భారం

మహబూబ్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సెలెక్షన్ గ్రేడ్ మునిసిపాలిటీ అయిన పాలమూరు పురపాలిక ఎట్టకేలకు కార్పొరేషన్ కానుంది. మూడు, నాలుగేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన కార్పొరేషన్ కల ఎట్టకేలకు సాకారం కాబోతున్నది. ఇందుకు సంబంధించిన జీవో విడుదలైన వెంటనే ప్రక్రియ షురూ కానుంది. మునిసిపాలిటీ నుంచి అప్‌గ్రేడ్ కానుండటంతో అభివృద్ధి కూడా అదే స్థాయిలో జరగనుంది. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న నగరం కావడం, ఇప్పటికే ఎంతో అభివృద్ధి చెందుతున్న పట్టణం కార్పొరేషన్‌తో వేగంగా అభివృద్ధి చెందనుంది.

మూడు నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న పురపాలిక ఇప్పటికే వ్యాపార వాణిజ్య రంగాలలో దూసుకెళుతోంది. విద్య, వైద్యం, పారిశ్రామిక రంగంలో మరింత ప్రగతి సాధించనుంది. అప్‌గ్రేడేషన్ శరవేగంగా అభివృద్ధి చెందనుంది. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందనున్నాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి అమృత్‌నిధులు పెద్దమొత్తంలో రానున్నాయి. వీటితో నగరంలో పార్కుల ఏర్పాటు, సుందరీకరణ జరిగి ప్లాన్, నాన్‌ప్లాన్ గ్రాంట్‌లు కూడా పెరగనున్నాయి. గ్రీనరీతో పాటు పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంటుంది. తాగునీటి వనరులు, వేస్ట్ మేనేజ్‌మెంట్, రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక వసతులన్నీ మెరుగవనున్నాయి. ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ విభాగాలు విస్తరిస్తాయి. సిబ్బంది నియామకం చేపట్టడంతో పారదర్శకత పెరగనుంది. అన్ని రంగాల్లో ప్రస్తుతం ఉన్న ఆదాయ వనరులు పెరగనున్నాయి. మౌలిక వసతులు పెరగడంతోపాటు కొన్నాళ్లకు పన్నులు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో పాటు కార్పొరేషన్‌లో విలీనమయ్యే గ్రామాల ప్రజలపై పన్నుల భారం పడనుంది. గ్రామసేవలకు బదులు అన్ని రకాల సేవలకు కార్పొరేషన్‌కు రావాల్సి ఉంటుంది. కొన్నాళ్లు ఇబ్బందులు ఎదురవనున్నా ఆ తరువాత అంతా సర్దుకుంటుంది. జీవో వెలువడిన వెంటనే ముందుగా వార్డుల విభజనం చేపట్టనున్నారు. ప్రస్తుతం ఉన్న 49 వార్డులకు అదనంగా రెండు వార్డులు పెంచి 51 డివిజన్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు నోటిఫికేషన్ వేసి డివిజన్‌ల పునర్విభజన చేయనున్నారు. కాగా 70 ఏళ్లుగా పాలమూరు పురపాలిక కొనసాగింది. 1954లో మునిసిపాలిటీ ఏర్పడగా ఏడు దశాబ్దాలుగా ఎంతో మంది చైర్మన్‌లుగా పనిచేశారు. కాగా ప్రస్తుతం ఉన్న ఆనంద్‌కుమార్‌గౌడ్ చివరి మునిసిపల్ చైర్మన్ కానున్నారు.



మంత్రి శ్రీధర్‌బాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, మునిసిపల్ చైర్మన్, కౌన్సిలర్‌లు

● మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు

అసెంబ్లీలో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన మంత్రి శ్రీధర్‌బాబును శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మునిసిపల్ చైర్మన్, కౌన్సిలర్‌లు, నాయకులు సత్కరించారు. మహబూబ్‌నగర్ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, కౌన్సిలర్లు షబ్బీర్ అహ్మద్, మునీర్, నాయకులు పాపారాయుడు, అంజద్, చిన్న, యాదగిరిగౌడ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో డీజిల్ చోరీ

● నిలిచిన రెండు నైట్‌హాల్ట్ బస్సులు

ఖిల్లాఘణపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రెండు ఆర్‌టీసీ బస్సుల్లో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం తెల్లవారు జామున డీజిల్ చోరీ చేశారు. ఆర్టీసీ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి డిపోకు చెందిన ప్రభుత్వ ఆర్టీసీ బస్సులలో సుమారు 382 లీటర్లు (దాదాపు 35వేల) విలువ గల డీజిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఖిల్లాఘనపురం మీదుగా మహబూబ్ నగర్ వరకు ఆర్టీసీ బస్సులు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటాయి. శుక్రవారం రాత్రి ప్రతీ రోజు మాదిరిగా మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు దగ్గర నైట్ హాల్ట్‌గా గల వనపర్తికి, మహబూబ్ నగర్ జిల్లా కేంద్రాలకు వెళ్లేందుకు రెండు బస్సులు నిలిపారు. బస్సును నిలిపి భోజనం చేసిన అనంతరం డ్రైవర్లు, కండక్టర్లు బస్సుల్లో నిద్రపోయారు. గుర్తు తెలియని వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా ఒక బస్సులో నుంచి 212లీటర్లు, మరో బస్సులోంచి 170 లీటర్ల డీజిల్‌ను శుక్రవారం అర్ధరాత్రి బస్సుల్లోంచి గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్ ఎత్తుకెళ్లారు. ఉదయం 5 గంటలకు నిద్రలేచిన సిబ్బంది సంఘటనను గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బస్సుల్లో సిబ్బంది నిద్రపోయినప్పుడే చోరీ జరగడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. డీజిల్ చోరీ జరగడంతో బస్సులు నిలిచిపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. బస్సుల్లోంచి డీజిల్ చోరీ చేసే సమయంలో బస్సు డీజిల్ ట్యాంక్ వద్ద డీజిల్ రోడ్డుపై పడిపోయిన మరకలు ఏర్పడ్డాయి.

మండల కేంద్రం నుంచి మహబూబ్ నగర్ రోడ్డు వైపు డీజిల్ ఎత్తుకెళ్లినట్లు జాడలు కనిపించాయి. ఈ విషయంపై వనపర్తి డిపో మేనేజర్ వేణుగోపాల్‌ను వివరణ కోరగా రెండు బస్సుల్లో డీజిల్ చోరీ జరిగిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్‌ఐ సురేష్ గౌడ్ కేసు నమోదు చేసుకుని ప్రధాన రహదారిపై గల సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని తెలిపారు.

నిలువురాళ్లను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్



రాళ్లు పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ గరీమానరుల

కృష్ణ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని ముడుమాల్ గ్రామ శివారులో వెలసిన ఆదిమానవుల నిలువు రాళ్లను యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ కేపీరావుతో కలిసి జిల్లా ట్రైనీ కలెక్టర్ గరీమానరుల శనివారం పరిశీలించారు. ఆసియా ఖండంలో ప్రఖ్యాతిగాంచిన నిలువురాళ్లు మరెక్కడా ఇలాంటివి లేవని కేపీరావు ట్రైనీ కలెక్టర్‌కు వివరించారు. నిలువురాళ్లు తెలంగాణ రాష్టానికి ప్రత్యేక చరిత్ర అని, వాటి సంరక్షణ చేయాలని, రాబోయే భావితరాలకు నిలువురాళ్లను రక్షించి వాటిని కాపాడుకోవాలని అన్నారు. తహసీల్దార్ దయాకర్‌రెడ్డి, ఎంపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వర్ బయలుదేరిన క్రీడాకారులు



పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ ఆర్చరీ, యోగా క్రీడాకారులు

పాలమూరు యూనివర్సిటి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ ఆర్చరీ, యోగా మహిళా జట్లు భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలో పాల్గొనేందుకు శనివారం బయలుదేరారు. ఈ పోటీలు ఈ నెల 24 నుంచి 27 వరకు జరుగుతాయని, క్రీడాకారులు ప్రతిభ కనబరిచి యూనివర్సిటీకి విజయం అందించాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ట్రాక్‌సూట్, టీమ్ యూనిఫామ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప, ఓఎస్డీ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, పీయూ పీడీ డాక్టర్ శ్రీనివాసులు, కోచ్‌లు నాన్‌టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

జడ్చర్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లా కేంద్రంలోని స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కల్పన తెలిపారు. విద్యార్థులు ఎస్.నిఖిత, మహిన్, ఉజమా తైసిన్‌లను అభినందించినట్లు తెలిపారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు.

గురుకుల పాఠశాలలో పాము

- భయబ్రాంతులకు గురైన విద్యార్థినులు

కోడేరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల పరిధిలోని మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో శనివారం సాయంత్రం పాము సంచరించడంతో విద్యార్థినులు భయబ్రాంతులకు గురయ్యారు. పాఠశాల వాచ్‌మెన్ పక్కనే ఉన్న వారికి తెలుపగా ఆ పామును చంపేశారని తెలిపారు. పాఠశాల ఆవరణలో విష సర్పాలు సంచరించడంతో విద్యార్థినులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బిక్క బిక్కుమంటూ ఉంటున్నారు.

న్యూస్ బాక్స్

నల్ల బెల్లం, సార పట్టివేత

మహ్మదాబాద్ డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మం డలంలోని మండలంలోని మదిరమీది తండాలో మూడు లీటర్ల సార, 100 లీటర్ల నల్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తంరెడ్డి తెలిపారు.

కొనసాగిన ధాన్యం కొనుగోలు

దేవరకద్ర, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్రకు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ఆర్‌ఎన్‌ఆర్ 34 క్వింటాళ్ల విక్రయానికి రాగా, క్వింటాలు ధర గరిష్ఠంగా రూ.2,639, కనిష్ఠంగా రూ.2,602 పలికింది. కందులు తొమ్మిది క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.7,419, కనిష్ఠంగా రూ.7049 పలకినట్లు మార్కె ట్ అధికారి జయశ్రీ తెలిపారు.

విద్యార్థులకు బూట్లు పంపిణీ

నవాబ్‌పేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రుక్కంపల్లి, సీతమ్మతండా, తూక్యతండా, లోకిరేవు, లింగంపల్లి, ఆర్సీపూర్, గుబ్బడి కుచ్చతండా, కాకర్జాలతండా, కాకర్జాల, చౌడూర్, దేపల్లి, అమ్మాపూర్, గురుకుంట గ్రామాల్లో శనివారం జనుంపల్లి దుశ్యంత్‌రెడ్డి విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. మార్కెట్ చైర్మన్ హరిలింగం, పార్టీ అధ్యక్షుడు రాంచంద్రయ్య, అళ్ల భూపాల్‌రెడ్డి, దేపల్లి వెంకటేష్ గౌడ్, హమీద్ ఉన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

గండీడ్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బూత్‌స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయనున్నట్లు బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు ప్రభునాయక్ అన్నారు. శనివారం మండలంలోని కప్లాపూర్ గ్రామంలో బూత్ నంబర్ 59లో బీజేపీ బూత్ కమిటీని ఎన్నుకున్నారు. కప్లాపూర్ గ్రామ బూత్ అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి మల్లేష్, బీఎల్‌ఏ కేశవులు, మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, గిరిజన, దళిత మోర్చా మండల అధ్యక్షులు సంతోష్‌నాయక్, కావలి నర్సయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రతే లక్ష్యం

జడ్చర్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పరిశుభ్రతే లక్ష్యంగా ముందుకు సాగేందుకు కృషి చేస్తున్నామని మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత అన్నారు. శనివారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో 41 అంశాలు ఆమోదం పొందినట్లు తెలిపారు. ప్రతీవార్డుకు సివిల్‌వర్క్‌లకు రూ.లక్ష కేటాయించినట్లు తెలిపారు. 13, 24, 26వ వార్డుల్లో చెత్తను సేకరించేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద ప్రైవేటుకు అప్పగించినట్లు వివరించారు.

గణితం నాగరికథకు అద్దంలాంటిది

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గణితం నాగరికథకు అద్దం లాంటిదని వాగ్దేవి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి అన్నారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శనివారం వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప మేధావి శ్రీనివాస రామానుజన్ అన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జ్యోతి నందన్‌రెడ్డి, యాజమాన్య సభ్యులు రాఘవేంద్రరావు, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

శాసనాల అధ్యయనం వల్ల చరిత్ర తెలుస్తుంది

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శాసనాల అధ్యయనం వల్ల వాస్తవ చరిత్ర తెలుస్తోందని పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్ అన్నారు. శనివారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో చారిత్రక పర్యటనలో భాగంగా గంగాపురం ఆలయాన్ని సందర్శించి, అక్కడ తూర్పు చాణక్యుల నాటి శాసనాలు, శిల్పకళ సంపదను పరిశీలించారు.

ఉమ్రా యాత్రికుడికి సన్మానం

మూసాపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంకలమద్ది, మూసాపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మదీన హైమాద్ ఈనెల 22న ఉమ్రా యాత్రకు వెళ్తుండటంతో శనివారం మూసాపేట మసీద్‌లో మైనార్టీ నాయకులు సన్మానించారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు ఖాజామైనోద్దీన్, మాజీ ఉప సర్పంచు కలీమ్, పేష్ఇమామ్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ప్రత్యేక డ్రైవ్

▸ మహబూబ్‌నగర్, జడ్చర్ల డివిజన్‌లో యూడీసీల తనిఖీ



ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొన్న డీఈ లక్ష్మణ్, ఏడీలు తౌర్యానాయక్, మద్దిలేటి

పాలమూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. డ్రైవ్‌లో డీఈలు లక్ష్మణ్, చంద్రమౌళి, ఏడీలు తౌర్యానాయక్, మద్దిలేటి, సంతోష్‌కుమార్, నవీన్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో టౌన్-1, 2, 3 సెక్షన్లలో మొత్తం 88,136 కనెక్షన్లు ఉండగా, అందులో 20,323 మంది గృహజ్యోతి అర్హత ఉంది. వారిలో 19,407 మంది 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించగా, మిగిలిన 916 మంది 200 యూనిట్ల కంటే అధికంగా ఉపయోగించి అర్హత కోల్పోయారు. గృహజ్యోతి కింద ప్రభుత్వం రూ.78,91,368 చెల్లించింది. అధికంగా వినియోగించిన వారి నుంచి బిల్లులు వసూలు చేపట్టారు.

బిల్లులు చెల్లించని కనెక్షన్లు 3700

డోర్‌లాక్, అధిక బిల్లు రావటం, మీటర్ తిరగకపోవటం, కొందరు మీటరు పాడైపోయిందని ఎక్కడో పాడేయటం లాంటి అనేక కారణాలతో పట్టణంలో 3700 కనెక్షనను గుర్తించారు. సిబ్బంది రెగ్యులర్‌గా బిల్లులు వసూలు చేయటానికి వెళ్లకుండా ఆఫీసు దగ్గరే కూర్చుని డోర్‌లాక్, మీటరు తిరగటం లేదని రాస్తున్నారా? అని క్రాస్ చెకింగ్ చేశారు. శనివారం ఒక్కరోజే 2003 కనెక్షన్లను తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రజల సహకారంతోనే లో ఓల్టేజీ తీరుతుంది : తౌర్యానాయక్

పట్టణంలో రానున్న వేసవికాలంలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరిస్తాం. ఇప్పటికే నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.60 లక్షల మంజూరు కాగా, అత్యవసరంగా 15 చోట్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్స్ పెట్టాల్సిన చోట్లను గుర్తించాం.

ఘనంగా గణిత దినోత్సవం



అంకెలతో గణిత దినోత్సవం జరుపుకొంటున్న విద్యార్థులు

హన్వాడ/రాజాపూర్/పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నదర్పల్లి ప్రతిభా ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శనివారం గణిత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అంకెలతో చిత్రాలు వేసి గణిత ప్రాముఖ్యతను వివరించారు. ఈనెల 22న నిర్వహించే జాతీయ గణిత దినోత్సవన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి తెలిపారు. అదే విధంగా రాజాపూర్ మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అంతకుముందు విద్యార్థులు గణితానికి సంబంధించిన ప్రదర్శనలు చేశారు. హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గణితశాస్త్రం దైనందిక జీవితంలో అంతర్భాగమని వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. శనివారం పీజీ కాలేజీలోని సెమినార్ హాలో రామానుజన్ జయంతి ఘనంగా నిర్వహించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప, వోఎస్డీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, విభాగధిపతి డాక్టర్ రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ మధు, డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



కోడ్గల్ పాఠశాల అవరణలో మేడిటేషన్ చేస్తున్న విద్యార్థులు

భూత్పూర్/చిన్నచింతకుంట/జడ్చర్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రోజు ధ్యానం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చు అని వైద్యాధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని కప్పెట ప్రాథమికోన్నత పాఠశాల్లో విద్యార్థుల చే ధ్యానం చేయించారు. ఈ సందర్భంగా ధ్యానం, యోగా వంటివి విద్యార్థులకు తప్పని సరిగా చేస్తే ఆరోగ్యంతో పాటు ఒత్తిడిని జయించొచ్చు అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు విద్యలో రాణించాలంటే ప్రతీ రోజు యోగా, ధ్యానం అనేవి దిన చర్యలో భాగంగా పెట్టుకోవాలన్నారు. ఒత్తిడి, టెన్షన్, ఆందోళన వంటివి దరి చేరకుండా ఉండాలంటే ధ్యానం చాలా ముఖ్యం అని హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు అన్నారు. సెల్ ఫోన్, టీవీలు తక్కువ చూడాలన్నారు. పాఠశాల హెచ్ఎం వెంకట్‌నారాయణ, వైద్య సిబ్బంది, అరుణాదేవి, గౌషియా, షాహిదా పాల్గొన్నారు. చిన్నచింతకుంట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో ఆయుష్ యోగా ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు రేణుక ధ్యానంపై అవగాహన కల్పించారు. జడ్చర్ల మండలం కోడుగల్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం మారెపల్లి శ్రీనివాసులు ప్రతినిత్యం యోగా సాధన, మెడిటేషన్ చేయడం వల్ల విద్యార్థుల్లో చెడు ఆలోచనలు తొలగిపోతాయన్నారు.

● మహబూబ్‌నగర్ విద్యావిభాగం : విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేందకు యోగా ఎంతో అవసమని ప్రిన్సిపాల్ కౌసర్ సహన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు హార్ట్ ఫుల్ నెస్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో హెల్ఫ్ మేనేజ్ పరీక్ష అనే అంశాలపై మానసిక ఒత్తిడి భయం, ఆందోళన తగ్గించేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సమయపాలన అలవర్చుకోవాలి

మిడ్జిల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే సమయపాలన అలవర్చుకోవాలని ప్రముఖ నటుడు, రచయిత వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రదీప్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తొమ్మిది, పది తరగతి విద్యార్థులకు విద్యా అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్, బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో గీతం జాలి, ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ లక్ష్యసాధనలో సమయంతో పాటు మేనేజ్‌మెంట్ కీలకమన్నారు. అందరిలా కాకుండా మనలా ఇంకొకరు ఉండేలా లక్ష్యసాధనను ఎంచుకోవాలని అందుకు సంబంధించిన పలు విషయాలను ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు వెంకటేశ్వర్లును అభినందించారు. ఎంఈవో సుధాకర్, మండల వైద్యాధికారి శివకాంత్, చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, ఉపాధ్యక్షుడు సంపత్‌కుమార్, వెంకట్‌రెడ్డి, సంఘం నాయకులు అశోక్‌కుమార్, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నటుడు రచయిత వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రదీప్‌కుమార్

పౌష్టికాహార లోపం లేకుండా చూడాలి

కోయిలకొండ/మూసాపేట/జడ్చర్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని ఇబ్రహీంనగర్ హెచ్ఎం నర్సిములు అన్నారు. శనివారం ప్రభుత్వ పాఠశాలలో ఆహారోత్సవంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం గతంలో సర్వపిండి, సకినాలు, నువ్వుల, రాగిలడ్డు, ఆకు కూరగాయలు వంటి పె ట్టాలని సూచించారు. పౌష్టికార లోపం ఉంటే ఎదుగుదల, జ్ఞాపక శక్తి తగ్గుతుందన్నారు. అదే విధంగా అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లితండా యూపీఎస్‌లో హెచ్ఎం బాలరాజు, మూసాపేట మండలం పోల్కంపల్లి జిల్లా పరిషత్‌లో హెచ్ఎం నాగయ్య, జడ్చర్ల మండలం కోడుగల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హెచ్ఎం మారేపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోషకాహారం దినోత్సవం నిర్వహించారు.

టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామకృష్ణగౌడ్

పాలమూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాచర్ల రామకృష్ణగౌడ్ ఎంపికయ్యారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామకృష్ణగౌడ్, సభ్యులుగా బక్క శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎంపికవడంతో సహచర ఉద్యోగులు అభినందించారు.

అల్లీపూర్‌లో హెల్త్ సర్వే

మహబూబ్‌నగర్ రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లీపూర్‌లో శనివారం పీయూ ఎన్ఎస్ఎస్ 9వ విభాగం ఏడు రోజుల శీతాకాల శిబిరంలో భాగంగా పీయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు హెల్త్ సర్వే నిర్వహించారు. గ్రామంలో హెల్త్ సర్వే నిర్వహించి, ఈ వారంలో హెల్త్ క్యాంపు నిర్వహించి మందులు అందజేస్తామని తెలిపారు. గ్రామంలో పరిసరాలను శుభ్రపరిచి ప్రజలకు కావల్సిన మౌలిక వసతుల కల్పనకు రిపోర్టు తయారు చేసి ప్రభుత్వానికి వివరిస్తామని తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

పాలమూరు యూనివర్సిటీ/మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో శనివారం సెమీ క్రిస్మస్ వేడులను ఘనంగా నిర్వహించారు. పీయూలోని పరిపాలన భవనంలో వీసీ చాంబర్‌లో అధ్యాపకులు, విద్యార్థులు మతాలకు అతీతంగా జరుపుకున్నారు. పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప కేక్ కట్ చేశారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి రోడ్‌లో గల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో క్రీస్తు జననం గురించి నాటక ప్రదర్శన ప్రదర్శించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్రద, వైస్‌ప్రిన్సిపాల్ అపర్ణ పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలను సందర్శించిన విద్యార్థులు

మహబూబ్‌నగర్ రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని బాలల సంరక్షణ సదన్‌ను శనివారం పీయూ మొదటి సంవత్సర విద్యార్థులు అధ్యాపకులతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో భాగంలో ఐసీడీఎస్, సీడబ్ల్యూసీ గురించి తెలుసుకున్నారు. సీడబ్ల్యూసీ చైర్మన్ నయీం తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు, తెలిసి తెలియకు నేరాలు చేసిన బాలలను ఈ కేంద్రల్లో సంరక్షిస్తామని వివరించారు. ఎంఎస్‌డబ్ల్యూ విభాగాధిపతి డాక్టర్ పర్వతాలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు ఎరువులపై అవగాహన

మూసాపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం అడ్డాకుల, మూసాపేట ఉమ్మడి మండలాలకు సంబంధించిన జాతీయ గ్రామీణ ఉపాది హామీ కూలీలు వంద రోజులు పని పూర్తి చేసుకున్న వారికి మూడు రోజుల శిక్షణ నిర్వహించారు. శనివారం మూడో రోజు కేవీకే శాస్త్రవేత్త రాజేందర్ హాజరై వర్మీ కంపోస్టు, సేంద్రియ ఎరువుల తయారీ, డైరీ నిర్వాహణ, నర్సరీలు, పండ్ల తోటల పెంపు, చీడ పురుగుల నివారణకు వాడాల్సిన మందులపై ఉపాది కూలీలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో కృష్ణయ్య, ఏపీడీ మంజుల, ఎంపీవో అనురాధ, ఉపాది ఏపీవో పులేందర్, సాంకేతిక సహాయకులు సుజిత, ఈశ్వర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సత్యభాస్కర్‌రెడ్డికి సన్మానం

మహబూబ్‌నగర్ రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో తొలిసారిగా పాలమూరు జిల్లా వాసీ కావడం గర్వించ దగ్గ విషయమని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. శనివారం పీయూ పరిపాలన భవనంలో, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప, పీయూ అధికారులతో కలిసి ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఎంపీఎస్ కళాశాలో అసోషియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సత్యభాస్కర్‌రెడ్డిని ప్రభుత్వం ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించడంతో శాలువాతో సన్మానించారు.

ఐక్యతతోనే వర్గీకరణ సాధ్యం

పాలమూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఐక్యతతోనే వర్గీకరణ సాధ్యమని, సుదీర్ఘ కాలం పోరాటం చేయటంతోనే ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పు వచ్చిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాసు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో వివిధ మాదిగ సంఘాల ఐక్యతా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సుమారు 30 ఏళ్ల నుంచి వర్గీకరణ చేయాలని, మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం కావాలని పోరాటం చేస్తున్నట్లు వివరించారు. నేడు వర్గీకరణ అమలు చేసుకునే సమయం ఆసన్నమైందన్నారు. బోయపల్లి నరసింహులు, వెంకటస్వామి, మల్లెపోగు శ్రీనివాస్, బొర్ర సురేష్, రమేష్, కాలె నరేందర్, కేశవులు, శ్రీరాములు, జాన్సన్, అమృతమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి : మునిసిపల్ చైర్మన్



మేళాను పరిశీస్తున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్ పాఠశాలలో ఘనంగా స్కూల్ మేళా నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై పరిశీలించారు. విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయని అభినందించారు. వ్యవసాయదారుడు జంతువుల నుంచి పంటను రక్షించుకోడంపై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు బాగుందని విద్యార్థులను అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ జలజం అరుంధతిరాయ్, లుంబిని స్కూల్ కరస్పాండెంట్ లక్ష్మణ్‌గౌడ్, ఏపీజీవీబీ రిటైర్డ్ జనరల్ మేనేజర్ రవీందర్, రిటైర్డ్ పీడీ సురేష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లు ఆందోళన చెందొద్దు

▸ మునిసిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్

మహబూబ్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చేసిన పనులకు బిల్లులు రావని కాంట్రాక్టర్‌లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బిల్లులు ఇప్పించే బాధ్యత మాదని మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ కాంట్రాక్టర్లకు భరోసా ఇచ్చారు. గతంలో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఎంతో మంది కాంట్రాక్టర్లు ఆర్థికంగా నష్టపోయిన విషయం తమకు తెలుసని, తాను చైర్మన్ అయిన 10 నెలల కాలంలో రూ.39 కోట్ల చెల్లింపులు చేయడం జరిగిందని వివరించారు. శనివారం మునిసిపల్ సమావేశ మందిరంలో కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. తాను వచ్చిన తరువాత రూ.39.76 కోట్ల బిల్లులు ఇవ్వడం జరిగిందని, ఇందులో రూ.30 కోట్లు జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులు కాగా, రూ.9.46 కోట్లు టీఎఫ్ఐడీసీ నిధులు ఇప్పించానని గుర్తు చేశారు. ప్రస్తుతం పురపాలిక పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనందున వెంటనే ఆయా వార్డుల్లో పనులు ప్రారంభించాలన్నారు. ఇటీవల కౌన్సిల్‌లో ఆమోదించిన రూ.42 కోట్ల పనులతో పాటు ప్రస్తుతం వార్డుల్లో తిరిగి పనులు గుర్తించి ప్రతిపాద నలు చేస్తున్నామని, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యమంత్రితో నిధులు మంజూరు చేయిస్తారన్నారు. వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ఫలితాలు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎంవో బాలుయాదవ్

మూసాపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు సాధించేందుకు ప్రతీ నెలలో మూడో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని సీఎంవో బాలుయాదవ్ తెలిపారు. అడ్డాకుల మండలం పొన్నకల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సర్కార్ బడులను బలోపేతం చేయడానికి అన్ని రకాల వసతులు, సదుపాయాలు సమకూర్చుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఇటీవలే 40 శాతం మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు, కామన్ డైట్ మెనూను పెంచడంతో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉందన్నారు. అనంతరం ఉత్తమ పెరెంట్స్‌గా ఎన్నికైన శ్రీనివాసులు, నరేష్‌గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రామలింగం, వెంకటేష్, ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు రవినాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు క్రైస్తవులకు క్రిస్మస్ విందు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఇస్తున్న ప్రేమవిందుకు పట్టణంలోని క్రైస్తవులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎంబీసీ చర్చి ప్రతినిధి టైటస్ రాజేందర్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎంబీసీ చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవ సోదరులకు ప్రేమ విందు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం సంతోషకరం అన్నారు. అందులో భాగంగా ఆదివారం ఎంబీసీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న విందుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. అంతకుముందు చర్చి పాస్టర్ వరప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారన్నారు. క్రిస్టియన్ మైనార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి శ్యామ్యూల్, కార్యదర్శి డేవిడ్, స్టీఫెన్, ఎమ్యూన్యూల్ రాజ్, క్రాంతి, సుజయ్ కుమార్, ప్రేమ్‌రాజ్, సామ్యూల్, మోహన్ పాల్గొన్నారు.

నేడు ఆశ వర్కర్ల జీపుజాతా

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆశ వర్కర్ల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తెలంగాణలోని 33 జిల్లాలో పర్యటిస్తూ కార్మికులను సంఘటితం చేసే క్రమంలో ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి జీపుజాతా చేరుకుంటుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతాకు ముఖ్య అతిథులుగా వ్యవసాయ కార్మిక సంఘం అల్ ఇండియా ప్రధాన కార్యదర్శి బి వెంకట్, జాత రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మీతో పాటు 12 మంది సభ్యులు రానున్నారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జిల్లాలోని ఆశ వర్కర్లందరు సకాలంలో హాజరుకావాలని కోరారు.

మూడేళ్లయినా పూర్తి కాని రోడ్డు పనులు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

చిన్నచింతకుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చిన్నచింతకుంట నుంచి ఉంద్యాల గ్రామానికి ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద మంజూరైన బీటీ రోడ్డు మూడేళ్లు గడిచినా పూర్తికాలేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు, అసెంబ్లీ కన్వీనర్ కుర్వ రమేష్, మండల అధ్యక్షుడు దశరత్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2021లో రూ.3.50 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులు 2023లో పనులు పూర్తికావాలని అగ్రిమెంట్ ఉన్నా కాంట్రాక్టర్ ఇంకా 1.5 కిలో మీటర్ల రోడ్డు నిర్మించాల్సి ఉందన్నారు. ఈనెల 23న రోడ్డు పనుల జాప్యానికి నిరసనగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. బీజేపీ నాయకులు రాములు, నరసింహ, మహేష్, రుతుకుమార్, బాలచంద్రుడు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



నిరసన తెలుపుతున్న ఫెడరేషన్ నాయకులు

పాలమూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. ముదిరాజు, దళిత సంఘాలు నిరసనకు మద్దతు తెలిపాయి. ప్రపంచంలోనే అంబేడ్కర్ జయంతిని నాలెడ్జ్ దినంగా 150 దేశాల్లో జరుపుకుంటున్నారని గుర్తు చేశారు. అంతటి మహామేధావిని నిండు పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు అంబేడ్కర్‌పై ఉన్న అవగాహన అర్థమైందన్నారు. రాజ్యాంగానికి ముందు ఎస్సీలు, ఎస్టీలు, బీసీలకు దేవుని మొక్కే అవకాశం లేదని, అంబేడ్కర్ వల్లనే ఆ అవకాశం దక్కిందన్నారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడే వాకిటి అశోక్‌కుమార్, ముదిరాజు సంఘం నాయకులు మైత్రి యాదయ్య ప్రసంగించారు. మెట్టుకాడి ప్రభాకర్, పసుపుల శ్రీనివాస్, మంత్రి నరసింహయ్య, కంచిమి లక్ష్మణ్, సాజిదా సికిందర్, ఎండీ మెయిజ్, జంగం దిలీప్, ఎంఎ అలీంసిద్ధికీ, పి.రమేష్, కాలే నరేందర్, గోకులం వెంకటేష్, బాలరాజు, శివ, రాములు, నరసింహులు పాల్గొన్నారు.